ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణభాస్కర



## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 30-4-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఉన్నది ఒక్కటే వస్తువు. దానినే ఆత్మ, చైతన్యము, భగవంతుడు గురువు అంటున్నాము. తను ఆత్మసాక్షాత్కారము పొంది తనశక్తితో ఇతరులు కూడా ఆత్మసాక్షాత్కారము వైపుకు ప్రయాణం చేయటానికి సహాయసహకారములు అందించేవాడే గురువు. మనమనస్సులో ఉన్న బలహీనతలు మనకు తెలియవు. మన బలహీనతలు గురువుకు తెలుస్తూఉంటాయి. గురువులోపల ఉంటాడు, బయట ఉంటాడు. మనలోని బలహీనతలు తలంపు రూపములో వచ్చాక మనకు తెలుస్తాయి కాని తలంపు రాకముందే మన బలహీనతలు గురువుకు తెలుస్తాయి. ఎందుచేతనంటే ఆయన లోపలకూడా ఉన్నాడు. మనబలహీనతలు తొలగించుకోవటానికి ఆయన బయట ఉండి బోధనచేస్తాడు. ఆబలహీనతలు జయించటానికి లోపల ఉండి మనకు శక్తిని ఇస్తాడు. బయట ఉండిబోధచేసేవాడు, లోపల ఉండి శక్తిని ఇచ్చేవాడుకూడా గురువే.

మనం ఏ మతస్థులు అయినా, ఏ కులస్థులు అయినా దేవుని ఆరాధించినా అందరిగమ్యం ఒక్కటే. అదిమన హృదయంలో ఉన్న సత్యమును తెలుసుకోవటమే. ఒక సద్వస్తువు మన హృదయంలో ఉంది. మనం జపంచేసినా, ధ్యానంచేసినా, పూజచేసినా, సత్పురుషుల సహవాసంచేసినా ఆవస్తువును తెలుసుకోవటం కోసమే. ఆవస్తువును తెలుసుకొంటే గాని మనకు స్వేచ్ఛలేదు, శాంతిలేదు, ఆనందంలేదు. ఆవస్తువును పొందేవరకూ ప్రతిజన్మలోనూ ఏదో ఒక అశాంతి, దుఃఖం, వెలితి మనలను వెంటాడుతూ ఉంటాయి. దేహం మీద, మనస్సుమీద మనకు ఉన్న భ్రాంతి పల్చబడితే వస్తువు మనకు వ్యక్తమవుతుంది. మనస్సు యొక్క చాపల్యం తొలగించు కోవటానికి బయటగురువు బోధిస్తాడు. మనస్సుకు ఏకాగ్రత తీసుకొనివస్తాడు. మన మనస్సు పక్వానికివచ్చిన తరువాత లోపల ఉన్న గురువు దానిని లోపలకు గుంజుకొని తనస్వరూపాన్ని ఇస్తాడు. ఇది గురువు చేసేపని. మనం చేసేపూజ, జపం, ధ్యానం ఈ సాధనల కంటే గురువు యొక్క అనుగ్రహం అత్యంత బలీయమైనది.

మనం ఏప్రాంతంలోఉన్నా, ఏ కులంలో ఉన్నా ఏ జన్మలోఉన్నా మన మనస్సు ఎంతవరకు బాగుపడు తోంది అని చూసుకొంటూ ఉండాలి. మనమనస్సు బాగుపడకపోతే ఆధ్యాత్మిక అభివృద్ధి కలుగదు. మీ ఇంటిని, మీ దేహన్ని ఎలా శుభ్రంగా ఉంచుకొంటున్నారో అలాగ మీ మనస్సును శుభ్రంగా ఉంచుకోవటానికి ప్రయత్నంచేయండి. ఇంతకాలమునుండి సాధనలు చేస్తున్నాము మనమనస్సు ఎంతవరకు బాగుపడింది అనిచూసుకొంటూ ఉండాలి. ఎందుచేతనంటే మనస్సు బాగుపడితే, మనస్సు స్వచ్ఛమయితే, మనస్సు ఏకాగ్రం అయితే అది హృదయం వైపుకు ప్రయాణించి హృదయంలో లయమవుతుంది.

కొంతమంది స్పర్శ ద్వారాను, కొంతమంది కళ్లతో చూసి, కొంత మంది మాటతోనూ భక్తులను

అనుగ్రహిస్తారు. కొంతమంది మౌనం ద్వారా అనుగ్రహిస్తారు. మౌనం అత్యంత శక్తివంతమైనది. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటం కాదు. ఎవడి మనస్సు అయితే తన మూలంలో అణిగిపోయిందో అక్కడనుండి మౌనం వస్తుంది. మనస్సు తన మూలంలో అణిగిపోయినపుడు అక్కడనుండి శక్తితరంగాలు, కాంతి తరంగాలు ప్రసరిస్తాయి. ఎక్కడయితే మౌనం ఉందో అక్కడ శక్తి ఉంటుంది, జ్ఞానం ఉంటుంది. మౌనం నుండి వచ్చే శక్తి తరంగాలు, కాంతి తరంగాలు నిన్ను పవిత్రుడిని చేసి, నిన్ను జ్ఞానిని చేస్తాయి. నీవు ఇంటి దగ్గర చదువుకొన్న దానికంటే గురువు దగ్గర విన్నప్పడు అది నీ మనస్సుకు పడుతుంది. నీ జీవిత గమ్యం ఏమిటో నీకు తెలుస్తుంది. అభ్యాసము చేయాలి అనే ప్రేరణ నీ హృదయంలో నుండి వస్తుంది.

స్వప్నంలో నుండి జాగ్రదావస్థలోనికి వచ్చినవాడికి స్వప్నం అబద్ధం అని ఎంత స్పష్టంగా తెలుస్తుందో అలాగ హృదయంలో ఉన్న సత్యవస్తువు అనుభవంలోనికి వచ్చినప్పడు ఈ ప్రపంచము, జనన మరణములు ఇవి అన్నీ స్వప్న మాత్రమే అని అంత స్పష్టంగా తెలుస్తుంది. సత్యం నిర్మలంగా ఉంటుంది. సహజంగా ఉంటుంది. గొడవలన్నీ మనస్సే తెచ్చిపెడుతోంది. నీవు పెద్ద పెద్ద సాధనలు చేయలేకపోయినా నీ మనుస్సుతో ఏమీ ఊహించుకోవద్దు. మనస్సులో ఏదో ఊహించుకొంటూ ఉంటే దానికి వ్యతిరేఖంగా ఎవరైనా మాట్లాడినా నీకు దుఃఖం వస్తుంది. నీ మనుస్సు దేనితోనూ తాదాప్యం పొందకుండా ఉంటే దానంతట అదే దాని పుట్టుక స్థానమైన హృదయంలోనికి వెళ్ళిపోతుంది.

ఇతరులు పొరపాటుగా మాట్లాడుతున్నారు అనుకోండి. మనం పొరపాటుగా మాట్లాడకూడదు. ఇతరులు చేసేది ఏదైతే పొరపాటు అనుకొంటున్నామో అదే మనం కూడా చేస్తే మనం కూడా పొరపాటు చేసినట్లు అవుతుంది. ఇతరులు ఉద్రేకంగా మాట్లాడుతున్నారు అనుకోండి. మనంకూడా ఉద్రేకంగా మాట్లాడితే అదే పొరపాటు మనంకూడా చేస్తునట్లు గుర్తు. లోపల ఆలోచన ఎంత తక్కువగా ఉంటే అంత తొందరగా ఉద్రేకం వస్తుంది. నీకు ఎదుటివారిలో లోపాలు కనిపిస్తూ ఉంటే అవి ఎంతో కొంత నీలోకూడా ఉండి ఉండాలి. నీ మనస్సులో ఉన్నదే బయట కనిపిస్తుంది. గోడను ఎవరైనా ఏమన్నా అన్నా అది ఏమీ అనదు ఎందుచేతనంటే గోడ జడం. అలాగే మనం కూడా ఎవరైనా పొగడినా ఏమీ అనుకోకుండా, ఎవరైనా తిట్టినా ఏమీ అనుకోకుండా తెలివి తోటి, సాధనతోటి, ఎరుకతోటి ఆ గోడ స్థితిని మనం సంపాదించుకొంటే ఈ జన్మలోనే మనకి జ్ఞానం కలుగుతుంది. నీకోరిక నెరవేర్చుకోవటం కోసం నువ్వు ఎంత ప్రయత్నం చేస్తున్నావో భగవంతుని అనుగ్రహం పొందటంకోసం అంత ప్రయత్నం చేస్తే నీ మనస్సులోని దోషములు వాటి అంతట అవే పోతాయి. నీ మనస్సు శుద్ధి అవుతుంది, నీకు జ్ఞానం కలుగుతుంది.

ఎదుటి వ్యక్తులు మంచి చేయవచ్చు, చెడ్డ చేయవచ్చు, చెడ్డ ఎందుకు జ్ఞాపకం పెట్టుకొంటావు. వాడు చేసిన మంచిని జ్ఞాపకం పెట్టుకుంటే వాడిమీద ప్రేమ కలుగుతుంది. చెడ్డ జ్ఞాపకం పెట్టుకొంటే వాడిమీద ద్వేషం, అసూయ కలుగుతుంది. నీవు చాలా నష్టపోతావు. గురువు ఏపని చేసినా నీమనస్సును పవిత్రం చేయటానికే చేస్తాడు. నాకు ఏమీవద్దు. నీ దయఉంటే చాలు, నీకృప ఉంటేచాలు అని అనుకొంటే ఆయన దయ వస్తుంది, నీ కోరికలు కూడా నెరవేరతాయి. ఆయన కృప కోసం కాకుండా కేవలము నీకోరికల కోసం దేవుని ప్రార్థిస్తే ఈ జన్మలో కాకపోయినా మరల

జన్మలలో అయినా నీ కోరికలు నెరవేరతాయి. వాటివలన ఫలితం వస్తుంది. ఫలితం అనుభవిస్తావు. అంతా కాల ప్రవాహంలో కొట్టుకొని పోతుంది. ఇవి అన్నీ సత్యంకాదు. నీవు గురువు కృపను మాత్రమే కోరుకొంటూ ఉంటే అదే నీకు సత్యమును పట్టి ఇస్తుంది.

నాకు ఒక దేహం ఉంది అనుకొంటున్నావు. నాకు బయట ప్రపంచం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అనే భావన నీకు ఉంది. నీలో ఉన్న ఆభావన తొలగించటం కోసం లోపల ఉన్న ఆత్మే నీకోసం బయట ఒక దేహం ధరించవలసి వస్తోంది. నీకు ఒక దేహం ఉంటుంది. గురువుకు దేహం ఉంటుంది. కాని గురువుకు నీకు తేడా ఏమిటి అంటే గురువు ఆ దేహంలో ఉన్నా తాను ఆ దేహం కాదు అని ఆయనకు తెలుసు అందువలన ఆయనకు ప్రమాదం లేదు. కాని మనం ఆ దేహానికి పరిమితమై పోతున్నాము. అందువలన ప్రమాదంలో పడుతున్నాము.

గాఢనిద్రలో నుండి జాగ్రదావస్థలోనికిరాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. ఆ తలంపువచ్చి దేహంతో కలిసిపోతుంది. దేహంతో కలసిపోయిన మొదటి తలంపే నీకు ఇతర తలంపులు రావటానికి కారణం. ఈ నేను అనే తలంపుకు అనుకూలంగా ఉన్నవారిని మంచివారు అనుకొంటున్నాము. ఈ నేను అనే తలంపుకు ప్రతికూలంగా ఉంటే వారు నిజంగా మంచివారు అయినా చెడ్డవారు అనుకొంటున్నాము. పరిశీలన చేసి చూస్తే మీకే తెలుస్తుంది. మనం బ్రతకటమే ఈ నేను అనే తలంపుకోసం బ్రతుకుచున్నాము. అందుచేత నేను అనే తలంపు ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏదీ లేదు అన్నారు భగవాన్. జ్ఞానం సంపాదించాలనే కాంక్ష నీకు ఉన్నప్పడు ఆకాంక్షను నెరవేర్చటంకోసం జ్ఞానం బోధించటంకోసం ఆయనకు దేహంతో ఏమీ పనిలేకపోయినా గురువు ఒక దేహాన్ని కల్పించుకొని వస్తాడు. కేవలం మనమీద దయతప్పించి ఇంకో కారణం ఏమీ లేదు. అలా దేహం ధరించి వచ్చినప్పడు పక్వానికి వచ్చినవారు పట్టుకొంటారు. మిగిలినవారు వారికి దేహబుద్ధి ఉంటుందికాబట్టి ఆయనను కూడా దేహానికే పరిమితం చేస్తారు. ఆయనతో మానవ సంబంధం పెట్టుకొంటారు. మనం ఎలా చూసిన ఆయనకు అక్కరలేదు. మన మనస్సు ఎంతవరకు పక్వానికి వచ్చిందో ఆయన చూస్తూ ఉంటాడు.

బాల్యం, యౌవ్వనం, వృద్ధాప్యం ఈ శరీరం యొక్క చలనం అహంకారికి నిజంవలె కనిపిస్తుంది. నీలోపల ఉన్న సత్యం నీకు తెలిసినప్పడు ఇవి అన్నీ అసత్యం అని తెలుస్తుంది. అహంకారంలో ఉన్నప్పడు చలనం నిజం అనిపిస్తుంది. మనస్సు యొక్క చాపల్యానికే చావు నిజం అనిపిస్తుంది. పుట్టుక నిజం అనిపిస్తుంది. ఈ శరీరం మరణించిన తరువాత జీవుడు నరకానికి వెళ్ళవచ్చు అదికూడా జీవుడికి నిజం అనిపిస్తుంది. వాడి కోరికలు నెరవేర్చుకోవటానికి ఒక దేహం ధరిస్తాడు. అప్పడు ఆ పుట్టుక నిజం అనిపిస్తుంది. ఆ దేహంలో కొంత కాలం ఉన్న తరువాత మరణిస్తాడు. అప్పడు మరణం నిజం అనిసిస్తుంది. ఇవి అన్నీ జీవలక్షణాలేగాని ఆత్మకు సంబంధించిన విషయాలుగావు. ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు, వికారములులేవు. ఆత్మ నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు ఈ ప్రకృతి నుండి బయటకు వస్తావు.

పునర్జన్మలు, దేవుడు, ఆత్మ ఈమాటలు ప్రక్కన పెట్టండి. అసలు మీరు పూర్వజన్మలలో కొంత సత్కర్మ చేస్తేగాని, ఎంతో కొంత పుణ్యం చేస్తేగాని, శాస్త్రాన్ని శ్రవణం చేస్తేగాని ఇంద్రియాలద్వారా